# ప్రేమ పరిణామం : :

రచన :
శ్రీ పి. భాస్కర్

రేరాణి పున్నమి నాటి పాల వెన్నెలలో జలకమాడుతూంది. దూరాన పర్వత శిఖరాలు మంచుతో కప్పబడి, ఆ వెన్నెల వెలుగులో నూతన శోభతో ప్రకాశిస్తున్నాయి. ప్రకృతి అంతా ప్రశాంతంగా నిద్రపోతూంది.... కాని....

చేరువనే కొండ కాలువ ఒకటి ప్రవహిస్తూ, పెడుతూన్న ఘోష మాత్రం ఈ ప్రశాంత వాతావరణాన్ని చీలుస్తూ వినిపిస్తున్నది.

'మోతీమహలు'లో ఒక గదిలో – సలీమ కిటికీ తలుపు తెరచుకుని నిశా సౌందర్యాన్ని తిలకిస్తూంది. పాలపిట్టరంగు మేలిముసుగు లోపల దోబూచులాడే కుంతలాలూ, ఎర్రని బోర్ మీద, నడుమువరకూ వ్రేలాడుతున్న ముత్యాలసరమూ; జరీపనితో రెండు వజ్రాలు పొదిగిన పాదరక్షలతో, పసిడి బొమ్మలా మెరుస్తూంది సలీమ.

నాలుగు గోడలకు అమర్చిన నిలువుటద్దములలో గదిలోని ప్రతీ వస్తువూ ప్రతిబింబిస్తూంది. నేలమీద పరచిన అరేబియా దేశపు విలువైన తివాచీలు; కిటికీ ప్రక్కగా, గోడ నానుకొనివున్న బంగారపు పూల కుండీలలో అప్పుడే విరిసిన పూలూ; సుగంధ ద్రవ్యాలు కాలుతూన్న శమాదానాలూ; ద్వారములకు నేర్పుతో అల్లిన నాగకేసరపు పూమాలలూ; ఇంకా నగిషీ పనితో చక్కగా చేయబడిన దంతపు విగ్రహాలు మొదలయిన దేశ-విదేశ వస్తువులు; చాలా క్రమపద్ధతిలో అలంకరింపబడి వుందా గది. గది అంతా పుష్పపరిమళాలతో ఘుమఘుమ లాడుతూంది.

పాదుషా వేటకు పోయి రెండురోజులుగా తిరిగి రాలేదు. పాదుషా ఎప్పుడు వస్తారా అని సలీమ ఎదురు తెన్నులు చూస్తూ కిటికీవద్ద కూర్చుంది. కిటికీగుండా పొంచి ఆ వెన్నెల వెలుగులో దూరాన పోతూన్న పాలకీలను పరికించింది. ఆ పాలకీలలో పాదుషా రావచ్చు అని తలపోసింది సలీమ, కాని, పాలకీలు వేరొక దారిన పోతూ దృష్టిని అతిక్రమించేసరికి ఆమె ఆశ నిరాశ అయిపోయింది. విసుగుగా మేలి ముసుగు తొలగించి 'ఏమీ తోచడంలేదు, ఏం చేసేదీ?' అని తనలో తాను గొణుగుకుంది. వీణ వాయించుదామని తీసి, సృతి కలవక అక్కడనే పెట్టివేసింది. 'మగవాళ్ళలాగా ఈ వీణ కూడా చెప్పినట్లు వినడం లేదే?' వీణమీద చాలా కోపం వచ్చింది సలీమాకు. 'మీనా! ఓ మీనా!' ఆమె ఎవరినో పిలచింది. బిత్తరి చూపులతో ఒక చెలికత్తె హాజరయింది. ఆమెయే మీనా.

మీనా సలీమాకు ప్రాణసఖి. అజంతా శిల్పంలా తీర్చిదిద్దిన అవయవ సౌష్టవం; చిరునవ్వు చిందే ముఖంతో ముద్దు గొలుపుతూ, చాలా ఆకర్షణీయంగా వుంది మీనా. పన్నీరు జలకమాడిన ఆమె కురులు చల్లని గాలికి తేలియాడుతున్నాయి. కాని, ఆమె ముఖంలో ఒక గంభీరమయిన విషాదరేఖ; ఆమె కండ్లలో ఒకవిధమైన నిరాశ ప్రతిబింబిస్తున్నాయి. ప్రియసఖిని కూర్చోమని – 'మీనా! నీకు వీణ అంటే ఎక్కువ ఇష్టమా? వేణువు అంటే ఎక్కువ ఇష్టమా?' అని అడిగి ప్రశ్నార్థకంగా చూసింది సలీమా.

'మీకు ఏది ఇష్టమో నాకూ అదే ఇష్టం,'

'కానీ, నీకు ఏదంటే ఎక్కువ ఇష్టం?' మళ్ళీ ప్రశ్నించింది సలీమ.

మీనా గద్గద స్వరంతో సమాధాన మిచ్చింది-'బేగమ్! మా దాసీలకు ఇష్టం ఏమిటి?'

ఒక క్షణం సలీమ మీనా ముఖంలో తేరి పార జూసింది—అయితే నేను, నిన్ను దాసీని చూసినట్టు చూస్తున్నానా?'

'లేదు. మీకు నామీద చాల దయ వుంది.'

'మరిఁ, అలాంటప్పుడు నువ్వు ఇంత విచారంగా ఎందుకుంటున్నావు? ఇక్కడకు వచ్చినప్పటినుంచీ చూస్తున్నా, ఇలాగే ఉదాసీనంగా వుంటున్నావు. నీ కష్టాలు నాతో చెప్పకూడదూ?' మీనా భుజం నిమురుతూ లాలిస్తూ ప్రశ్నించింది సలీమ.

సలీమ శరీరం, మీనాకు స్పృశించే సరికి, మీనా శరీరం పులకించి, ఏ లోకాలలోనో విహరించింది. ఏమీ జవాబు చెప్పలేక సలీమ ముఖం చూస్తూ వుండిపోయింది మీనా.

'సఖి! నీ బాధ నాతో చెప్పవూఁ?' బుజ్జగించింది సలీమా.

'మీరు ఎందుకు ఉదాసీనంగా వుంటున్నారో ముందు చెప్పండి,' ఎదురు ప్రశ్న వేశిం మీదినా.

'ఇక్కడకు పాదుషా రావడం తగ్గించేరు, అందుకని మనసు బాగుండడం లేదు' అంది సలీమా.

'బేగమ్! తమకు ప్రియమైన వస్తువు దొరక్కపోతే ప్రతీ మనిషికీ తప్పకుండా విచారం కలుగుతుంది. ప్రేమకు భాగ్యవంతులు బీదవాళ్ళు అనే భేదం లేదు సలీమా!'

'ఓఁ, అదా సంగతి? అలా చెప్పు; నువ్వు ఎవరినో ప్రేమిస్తున్నావన్నమాట! అతనెవరో నాకు చెప్పు; పాదుషాతో చెప్పి, మీ ఇద్దరకూ పెండ్లి చేయించేస్తాను' అని చిరునవ్వు ఒలకబోసింది సలీమ.




SEENU & CO., 28.K. TANDAVARAYA GRAMANI ST. MADRAS-21.
GRAMS: "ORCAS" (ESTD 1946) PHONE 55357.
BRANCH: SINGAPORE-8 (CEYLON) AGENTS: N.C.M. STORES 82, MAIN ST. COLOMBO-11.
(ADVT. PERMITTED UNDER G.O.MS. NO 1121 HEALTH.)

'అయితే చెప్పనా ? నవ్వకండీ!'

'నవ్వనులే, చెప్పు, ఎవరిని ప్రేమిస్తున్నావో?'

'నేను మిమ్ములను ప్రేమిస్తున్నా!' అని తల దించేసుకుంది మీనా.

ఆ మాటలు సలీమాకు పొట్ట చెక్కలయ్యేటంత నవ్వును పుట్టించాయి. ఆ నవ్వు ఆపుకోవడానికి ప్రయత్నిస్తున్న సలీమ మీనా వణకడం గుర్తించలేకపోయింది.

'ఏం పాడను?' మురళి చేతిలోకి తీసుకుని అడిగింది మీనా.

'ఆఁ, ఆగు, గది అంతా వేడిగా వున్నట్టుంది. కిటికీ తలుపులన్నీ తెరచి, ఆ పూలదండలన్నీ తెచ్చి నాదగ్గరగా పెట్టు. హాయి గొలిపే వెన్నెల వుండగా ఆ దీపం ఎందుకు ? అది కూడా తగ్గించు.'

బేగం హుకూం నిర్వర్తించడానికి మీనా లేచింది.

'చూడు, చాలా దాహంగా వుంది. ముందు కొంచెం పానీయం ఏదయినా తీసుకురా.'

సుగంధ పరిమళాలు వెదజల్లుతున్న బంగారు మధుపపాత్ర సలీమా ముందు హాజరు పెట్టింది మీనా,' ఏమిటీ? ఇంత వేడిగావుందీ పానీయం ? పన్నీరు, ద్రాక్ష కలిపావా లేదా?' అని అడిగింది సలిమ.

'కలిపాను, సలీమా!' మీనా సవినయంగా సమాధానమిచ్చింది.

'సరే! ఇంకా కొంచెం కలిపి తీసుకురా.'

మీనా మధుప పాత్రను తీసుకుని వేరొక గదిలోనికి వెళ్ళింది. పన్నీరు, ద్రాక్ష కలిపింది. వాటితోపాటు వేరొక వస్తువు కూడా కలిపి, ఆ సువర్ణ పాత్ర తీసుకువచ్చి సలీమాకు అందించింది.

పాత్రలోని మధుప మంతా సేవించింది బేగం— 'ఇప్పుడు పాడు, నువ్వు నన్ను ప్రేమిస్తున్నానని కదూ! అన్నావు ? పాడు ఏదయినా ప్రేమగీతమే పాడు.' ఈ మాటలు పూర్తయేసరికి సలీమ చేతిలోని స్వర్ణపాత్ర జారి, క్రింద పడిపోయింది. సలీమ కూడా ఆ మధుప మత్తుకు సోలిపోయిన హృదయంతో మృదువైన హంస తూలికా తల్పం మీద జారిపోయింది. ప్రేమరసం చిందులాడుతున్న ఆమె అరమోడ్పు నయనాలు మాత్రం మీనాను తదేకంగా చూస్తున్నాయి. మీనా మురళితో మనసు కలిపి పాడటం మొదలు పెట్టింది—

"హైరీ మై తో ప్రేమ దివానీ
మేరా దర్ద్ న జానీ కోయీ...."

చాలా సేపటివరకూ తీయనైన మీనా కోయిల కంఠం, కన్నీరు కారుస్తూ గది అంతా కలయ తిరిగింది. మెల్లగా మీనా కూడా యేడవడం మొదలు పెట్టింది. మధుపే మత్తూ, యౌవనావేశం రెండూ కలిసి ఆమెను ఒడలు తెలియని స్థితికి తీసుకు వచ్చాయి.

పాట పూర్తి చేపి, తెలివి తప్పి పడివున్న సలీమాను చూసింది మీనా. పాలుగారుతున్న సలీమ లేత గులాబి బుగ్గలు, నిర్దాక్షిణ్యమైన ఆ మధుప తీక్షణతకు తట్టుకోలేక కొంచెం బిరుసెక్కిపోయాయి. సహజ రాగరంజితమైన ఆమె అధరం తాంబూలపు సేవనవలన ఇంకనూ, అరుణ రాగరంజితమైంది. పమిట తొలగిన సలీమ వక్షస్థలం, మలయమారుత తాకిడికి కదలుతూన్న లేత మామిడి చిగుళ్ళవలె వూగిసలాడుతూంది. నొసటిమీది సన్నని శ్వేదబిందువులు, కిటికీలోంచి, తొంగిచూస్తున్న శశాంకుని చిరునవ్వులో మంచి ముత్యాల్లా మెరుస్తున్నాయి. మత్తు గొలిపే మల్లెపూల పరిమళం పిచ్చెక్కిస్తూంది.

ఈ వాతవరణం అంతా నిజంగా మీనాకు మత్తేకలిగింది. వేణువుక్రిందపెట్టి, సలీమాకు దగ్గరగా వచ్చింది మీనా. ఆమెశరీరం ఒణకుతూంది; గుండెలు వేగంగా కొట్టుకుంటూన్నై. గొంతు ఎండి పోయింది; కనులు మండుతున్నాయి. ఆమె కూర్చుని తనపమిటచెంగుతో సలీమ ముఖంమీది శ్వేదబిందువులను మెమ్మదిగా తుడవ

DEEPAVALI CONCESSION

for High Class Watches

5 సంవత్సరములు గ్యారంటి. 15 దినములుమాత్రమే.
ఆర్డరుతో, సిగరెట్ లైటర్, ఫౌంటెన్ పెన్



జర్మన్ అలారం (రేడియో ఉన్నది) రూ 15/=.
మంచి క్వాలిటి రూ 18/=.





ప్యాకెట్ వాచ్ (రేడియో డయిల్స్) రూ 14/= వాటర్ ప్రూఫ్ సైజు, 15జూయెల్స్ 38/= 17 జూయెల్స్ రూ 40/=. 21జూయెల్స్ రూ 60/=.



రోల్డ్ గోల్డు సైజు 5 జూయెల్స్ రూ 22/=.
15 జూయెల్స్ రూ 30/=. 17 జూయెల్స్ రూ 38/=,

రోల్డ్ గోల్డు సైజు 5 జూయెల్స్ రూ 35/=. 15 జూయెల్స్ రూ 38/=. 17 బెస్ట్ జూయెల్స్ రూ 40/=.

5 రూ అడ్వాన్సుతో ఆర్డరుతో పంపవలెను.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో.

Correspondence in English.

**CALCUTTA WATCH CO (Sec 226).**

**Post.Box No. 12203 Calcutta 5.**

నారంభించింది. అలా తుడుస్తూంటే, మీనాలో, తీయని బాధకోసం తహతహలాడే శక్తులన్నీ, ఒక్కసారిగా పైకుబికి, వెల్లువలై ప్రవహించాయి. ప్రేమతో, ఉద్రేకంతో, వూగిసలాడింది మనసు. కోర్కెలతోనూ, ఊహలతోనూ, ఉప్పొంగిపోతూన్న ఆమె హృదయం ఆ మెత్తని బుగ్గలను చుంబించమని ఆమె అధరాల్ని తొందరచేసింది !!!........

* * *

ముఖం పైకెత్తేసరికి, తనుచేసిన ఈపనిని ఆశ్చర్యంతోనూ, కోపంతోనూ చూస్తున్నపాదుషా కనుపించాడు మీనాకు. తేలుకుట్టిన దొంగలా ఏమీ మాట్లాడలేక, చక్రవర్తి ముఖంచూస్తూ వుండిపోయింది. —"ఎవరు నువ్వు? ఏంచేస్తున్నావు?" మేఘంలా గర్జించాడు పాదుషా.

మీనా మాట్లాడలేదు. "సమాధానం చెప్పవేం?" మళ్లీ కోపంగానే అడిగాడు.

మెల్లగా —"జహాఁపనాహ్! ఒకవేళ ఈదాసీ ఏమీ సమాధానం చెప్పకపోతేనో?" తిరిగిప్రశ్న వేసింది మీనా.

ఒకసామాన్య దాసీకి ఇంత నిర్లక్ష్యమా? పాదుషా కోపంద్విగుణీ కృతమయింది—"నా మాటలకు సమాధానం లేదూ? సరే, నిన్ను వివస్త్రగాచేసి కొరడాదెబ్బలు కొట్టిస్తా."

మీనానుంచి ఇదివరకటి స్వరంతోనే జవాబువచ్చింది- "నేను పురుషుణ్ని; స్త్రీని కాదు."

పాదుషాకు ఒంటినిండా తేళ్లు, జెర్రులు ప్రాకినట్లయింది. కళ్లలోంచి నిప్పులు కురిపిస్తూ సలీమావైపు చూసేడు. స్పృహతప్పిన ఆమె నిండుయవ్వనం నగ్నంగా నిద్రపోతూంది. "నీచులు" అని అప్రయత్నంగా పాదుషాచేయి నడుముకువున్న బాకువద్దకుపోయింది. వెంటనే ఏదో స్ఫురణకువచ్చి ఆగాడు. కఠినమైన పాదుషా కంఠం యెవరిదో పిలిచింది--"బిజిలీ, బిజిలీ!"

క్షణకాలంలో భయంకర వికృతాకారం కలిగిన ఒక లంబాడీ స్త్రీవచ్చి, చక్రవర్తికి సవినయంగా తలవంచి

సలాముచేసి, హుంకూమ్‌కోసం ఎదురుచూస్తూ నిలుచుంది ఆజ్ఞాపించాడు పాదుషా—"వీణ్ని కారాగారంలో బంధించు. ఆకలిమంటలతో చావనివ్వాలి; ఆహారపానీయాలు ఇవ్వవద్దు వీడికి, ఊఁ"

బిజిలీ తన ఇనుపచేతులతో సుకుమారమైన ఆయువకుని రెక్కలుపట్టుకొని లాక్కుపోయింది. కొంచెం సేపట్లో ఆఇరువురు ఒకబలమైన ఇనుపద్వారం దగ్గరకు వచ్చారు. బిజిలీ ఆద్వారంతాళంతీసి తెరచిఖయిదీని లోపలకునెట్టి వేసింది. కీచుమన్నధ్వనితో తలుపులు మూసుకోగానే, వెలుతురు మాయమై యథాప్రకారంగా అంధకారం వ్యాపించింది.

2

తెల్లవారింది. సలీమాకు తెలివివచ్చి, ఖంగారుగా లేచింది. కుదుటిమీది సన్ననిచమట బిందువులకు అంటుకున్న ఉంగరాలజుట్టును. రెండుచేతులతోనూ సర్దుకొని, జారిపోయిన మేలిముసుగును తలపైన వేసుకుంది. విడివడినచోళీ గుండీలు సర్దుకోవడానికి అద్దం దగ్గరకు వచ్చింది, తలుపులుఅన్నీమూసి వుండటంచేత వెలుతురు కరువైపోయింది ఆగదిలో, సలీమ పిలచింది-"మీనా! ఓ మీనా! చాల ఉక్కగావుంది; కొంచెం కిటికీతలుపులు తెరు, మాయదారినిద్ర ఎంతపనిచేసింది? శరబత్తుకూడా చాలా తీక్షణంగావుంది, అసలులేవలేక పోయాను,"

సలీమ మాటలుయెవరూ వినిపించుకోలేదు, ఇంకా కొంచెంగట్టిగ పిలచింది సలీమ—"మీనా!" జవాబు రాకపోవడం సలీమాకు ఆశ్చర్యంకలిగించింది, తనే కిటికీతలుపులు తెరవాలని ప్రయత్నించింది, కాని, అవి బయటనుంచి వేయబడి వుండటంవల్ల రాలేదు. "ఏమిటి సంగతి? దాసీలంతా ఏమయ్యారు? మీనా ఎక్కడకు

మా ఖాతాదారులకు, అభిమానులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వకమైన
దీపావళి అభినందనములు !!

బాలరు మొదలు వృద్ధులవరకూ
స్త్రీ, పురుషులందరకూ పూర్ణతృప్తినిచ్చు మా

తంతి: YENKAYCEE. ఫోన్: 199
"నటరాజా"
బనియనులు
ఆకర్షణకు, ఆకారమునకు
మన్నికకు శ్రేష్ఠమైనవి
TRADE (N.K.C) MARK
తయారుచేయువారు:
నటరాజా నిట్టింగ్ కంపెనీ,
74, కుమరన్ రోడ్డు, తిరుప్పూర్

ఆంధ్రకు, ఒరిస్సాలకు సోల్ ఏజంట్లు :—
ఓరియంటల్ టెక్స్టైల్ ఏజన్సీస్, రాజమండ్రి

మా ఖాతాదారులకు, అభిమానులకు, దీపావళి అభినందనములు

యునైటెడ్ కెమికల్ డైమండ్ వర్క్సు.

ప్యాక్టరి
మధుర రోడ్డు
తిరుచినాపల్లి

కార్యాలయము
129 పెద్దబజారు
తిరుచినాపల్లి

UNITED CHEMICAL
ELECTRIC DIAMONDS

చంద్రా క్వాలిటి వజ్రములు

ఆభరణములకు
ప్రసిద్ధి చెందినవి

అన్నివూళ్లలో షరాబువ్యాపారులవద్ధ దొరకును.

నమ్మకమైన
సీల్ లాట్లు

మోతి R శ్రీరాములు శెట్టి
M.S. కృష్ణమూర్తి శెట్టి.

ప్రొప్రయిటర్లు

N. ఆదినారాయణ శెట్టి
N. రంగరాజులు నాయుడు.

వెళ్లింది?'' అని ఆశ్చర్యపోయింది సలీమ. గుమ్మం వైపువెళ్లి చూసేసరికి, చేతిలోకత్తి పట్టుకుని, పహరా కాస్తున్న బిజిలీద్వారం దగ్గర కనుపించింది. బేగంను చూడగానే తలవంచి మన్నించింది బిజిలీ.

రోషంతో అడిగింది సలీమ—''మీరంతా ఇక్కడకు ఎందుకు వచ్చారు?

''పాదుషాగారి హుకుం''

''పాదుషా వచ్చేశారా?''

''చిత్తం,''

''నాకు ముందుగా ఎందుకుతెలుప లేదు?''

''అనుమతి లేదు''

''పాదుషా ఇప్పుడు ఎక్కడవున్నారు?''

''జీనత్‌మహల్ అంతపురంలో,''

సలీమ హృదయంలో అభిమానం తలయెత్తింది. ''అయితే ఇప్పుడు జీనత్‌మహల్ అదృష్టం పండిందన్న మాట! బావుంది; క్షణిక సౌఖ్యంకోసం ఆశించేవాళ్లు. నిర్మల ప్రేమను ఎలా అర్థంచేసుకోగలరు? వాళ్లకు అందాన్ని ఆరాధించడం మాత్రమేతెలును. మనసులోని మమతలను గుర్తించలేదు.''

లంబాడీ స్త్రీ మౌనంగావుండటం చూసి—''నాసఖి మీనా ఎక్కడవుంది?'' అని అడిగింది సలీమ.

''కారాగారంలో.''

''ఏం?'' ఖంగారుగా అడిగింది బేగం.

''పాదుషాగారి హుకు,''

'అది ఏంతప్పు చేసిందని?''

'ఆసంగతి నేను చెప్పలేదు.'

'ఆ కారాగారపుతాళం ఇటుతే. నేను ఇప్పుడే దానిని విడుదల చేస్తాను.'

'మీరు కూడా మీ గదినుండి బయటికి పోవడానికి వీలులేదు.'

'అయితే నేను కూడా ఖయిదీ నేనా?'

'చిత్తం.'

సలీమ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆమె లోపలకు వచ్చి వెక్కి-వెక్కి ఏడుస్తూ ఒక సోఫాలో కూర్చుండిపోయింది. కొంచెంసేపాగి ఒక పత్రం వ్రాసింది—

''హుజూర్ !

నావలన తప్పులు వుంటే క్షమించండి. పగలంతా అలసిపోయి వుండటంచే, స్మృతి తప్పి నిద్రపోయి, మీర్లు వచ్చేసరికి మీకు స్వాగతం ఇవ్వలేకపోయాను, తరువాత, నా సఖి మీనాను కూడా క్షమించి విడిచి పెట్ట మని ప్రార్థిస్తున్నాను. తమరాక నాకు తెలియపరచడం ఆలస్యం చేసి, నిజంగా అది పెద్ద తప్పిదమే చేసింది. కాని, వయసులో చిన్నదవడంచేత, తెలియక పొరపాటు చేసింది. పాపం! చాల బీదపిల్ల. చాల కష్టాల్లో వుంది. దాని పొరపాటు నా పొరపాటుగా భావించి, మన్నించి విడిచి పెడతారని ఆశిస్తున్నా.

మీ

చరణదాసి

'సలీమ.'

ఉత్తరం చక్రవర్తివద్దకు పంపించింది. పాదుషా మనసు బాగులేదు. ఒక చక్రవర్తి భార్య 'జారిణి' అయిపోయింది. పరపురుషుడు ఆమె ముఖం ముద్దుపెట్టుకోవడం, తనకళ్ళారా చూసేడు. కోపంతో ఆయన ముఖం కందగడ్డలా కందిపోయింది. గడిచిపోయిన ఆ దృశ్యం ఆయన కళ్ళ ఎదుట ఇంకా నాట్యం చేస్తూంది. దాన్ని మరచిపోవడానికి ప్రయత్నం చేస్తూ, మధువు తెగ సేవిస్తున్నాడు పాదుషా. అదను కనిపెట్టి, జీనత్ మహల్ తన సవతిమీద చాడీలు నూరిపోస్తూంది. లంబాడీ స్త్రీని చూసి 'ఏం, ఎందుకు వచ్చావ్?' అని అడిగాడు పాదుషా.

లంబాడీ స్త్రీ గాభరా పడుతూ-'హుజూర్! సలీమబీబీ తమకు ఇవ్వమన్న అర్జీ' అని ఆపత్రిక పాదుషా ముందు పెట్టింది.

పాదుషా కోపావేశంతో తనకు తెలియకుండానే అనేశాడు-'సిగ్గులేక, ఇంకా పత్రం కూడానా? చావమని చెప్పు!' ఆయన చేతులు ఆ పత్రాన్ని చించివేశాయి.

(తరువాయి 43వ పేజి)


## చేతిపనుల వర్తక రహస్య స్వబోధిని

50 రూపాయల నుంచి 500 రూపాయల వరకు నెలకు సంపాదించవచ్చును. ఇందు సబ్బు దినుసులు, సెంట్లు, అత్తరు, హేరాయిల్స్, పప్పరమెంటు, వార్నిస్, వర్ణములు, పన్నీరు, షర్బత్తు ఊదువత్తులు కర్పూరం, సిరా దినుసులు, గిల్టుయిచ్చే విధము. పాటో ఎత్తువిధము, బాణసంచా, మందులు సులభముగా తయారుచేయు పద్ధతులతో 100 పేజిలు గల పెద్ద పుస్తకము. వెల రు. 1-8-0, పోస్టు ఖర్చు 12 అణాలు.

## కుట్టుపని స్వబోధిని

కోట్లు, ట్రౌజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు కొత్త పద్ధతులు డ్రాయింగులతో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు ఈ గ్రంథము చూచి సులభముగా నభ్యసించ తగినది, ప్రతి దర్జీవానికిని ముఖ్యముగా చేతిలో వుండవలసిన పుస్తకము, 92 పేజీలుగల40 కొలతలుగల పటములు గల పెద్ద పుస్తకం వెల 1-0-0, పోస్టు ఖర్చులు రు, 0-10-0

## వినోదం బుక్ డిపో,

32, కృష్ణప్పనాయక్ టాంకు వీధి, మద్రాసు-1

(29వ పేజీ తరువాయి)

లంబాడీ స్త్రీ తిరిగి వెళ్ళిపోయింది. పాదుషా సమాధానం వినేసరికి సలీమ నిశ్చేష్టయై నేలమీద కూర్చుండిపోయింది. దాసీ వెళ్ళిపోగానే, తలుపులు అన్నీ మూసివేసి, కటింకి మంటికి యేకధారగా యేడ్చింది సలీమ. గంటలు గడిచాయి. సుధాకరుడు పశ్చిమాన విశ్రమిస్తున్నాడు. 'పాదుషాలను పెండ్లిచేసుకోవడంకూడా మహాపరాధం అయిపోయిందే! కండ్లు కాయలు కాచేలా ఎదురు తెన్నులు చూసినా, గొంతు నొప్పి పట్టేలా మన్ననలు చేసినా, ఇంత చిన్న విషయానికి, అంటే-ఆయన రావటం తెలీకుండా నిద్రపోయినందుకు ఇంత కఠినశిక్ష విధించారే! ఇంతగా అగౌరవ పరచారే! బేగం అంటే అర్థం ఇదేనా ? జీనత్ మహలు, ఆమె దాసీలు ఈ సంగతి వింటే ఏమనుకుంటారు ? ఇంత అవమానం జరిగిన తరువాత, ఇంకా జీవించి ఉండటం కంటె చనిపోవడమే మేలేమో ? ఓ ఖుదా ! ఇంతకంటె ఏ పేద కర్షకుణ్ని పెండ్లిచేసుకున్నా సుఖపడేదాన్నేమో ! అప్పుడు ఇలాటి బాధలు ఏమీ వుండేవి కావేమో!' ఇలా పరిపరి విధాల వాపోయింది సలీమ.

కొంతసేపటికి, సలీమ హృదయంలో స్త్రీ సహజశక్తి ఉదయించింది. అప్పుడు ఒక ధృఢనిశ్చయాన్ని సూచించే చిహ్నములు ఆమె కళ్ళలో వ్యాపించాయి. ఆమె ఉద్రిక్తయై లేచి, వేరొక జాబు వ్రాసింది—

"ప్రజా రక్షకా !

మన ఇరువురమధ్య వివాహము అనబడే ఒక పవిత్ర బంధము వుంది. ఆ పవిత్రమయిన వివాహబంధాన్ని, అపవిత్రం చెయ్యడానికి ఇష్టంలేక, మీ ఆజ్ఞను అనుసరించి ఈ తుచ్ఛ శరీరాన్ని త్యజించుతున్నా; ఇంత అవమానము జరిగిన తరువాత, ఒక స్త్రీ ఈవిధంగా చనిపోవడం, సమంజసమే ననుకుంటా. కాని, ఒక్కమాట; మీరు ఇంతపెద్దదేశాన్నియేలే చక్రవర్తులే ! స్త్రీలను ఇలా అవమానపరచవచ్చా ? ఒక చిన్న తెలివితక్కువతనంలో జరిగిన పొరపాటుకు ఇంత కఠిణశిక్ష విధించవచ్చా ? కొంచెం నిదానించండి: మీరు వచ్చేసరికి పూర్తిగా నిద్రపోయాను: ఇదీ నేను చేసిన నేరం. సరే ! ఆఖరుసారి, ఈ లోకంనుంచి వెళ్ళిపోయేముందు, మిమ్మల్ని ఒకసారి కళ్ళారా చూడాలని వుంది. నా యీ కోరిక మన్నిస్తారని అనుకుంటా. నేను భగవంతుని చేరుకున్న తరువాత, నా భర్తను క్షేమంగా కాపాడమని, అల్లాను వేడుకుంటా !

"సలీమ."

ఉత్తరానికి అత్తరులు పూసి, అందరికి అందుబాటులో వుండే ఒక పూలకుండమీద పెట్టింది. తరువాత ఆమె తన నగలపెట్టెలోనుండి వజ్రపు టుంగరమొకటి తీసింది. అందులోని వజ్రాన్ని ముక్కలు, ముక్కలుగా చేసి, అవి గొంతులో వేసుకుని మ్రింగివేసింది.

## 3

సంధ్యారుణ కాంతుల్లో, పచ్చని చిగురాకులు పసిడి రేకుల్లా మెరుస్తున్నాయి. ఉద్యానవనంలోంచి మలయ మారుతం కమ్మని పూల పరిమళాన్ని మోయలేక, మోయలేక మోసుకొస్తూంది. సౌధోపరిభాగంమీద నడమాడుతూన్న పాదుషా దగ్గరకు ఒక్కసారిగా నలుగురు లంబాడీ స్త్రీలు ఆయాసపడుతూ వచ్చారు. 'హుజూర్ ! చాలా ప్రమాదం జరిగింది. సలీమబీబీ ఆత్మహత్య చేసుకున్నారు' అంటూ వాళ్ళు ఒక పత్రాన్ని పాదుషాకు అందించారు.

క్షణకాలంలో పాదుషా ఆపత్రాన్ని చదివాడు. వెంటనే సలీమ అంతఃపురంలోకి వచ్చాడు. తన కత్యంత ప్రియమైన సలీమ మట్టిలో పొర్లాడుతూ, మృత్యువును ఆహ్వానిస్తూంది. పాదుషా ఆ దృశ్యం చూడలేకపోయాడు.

'వైద్యుడు, వైద్యుణ్ని పిలవండి' ఖంగారుగా అరిచాడు చక్రవర్తి. వైద్యునికోసం చాలామంది పరువెత్తారు.

పాదుషా కంఠం గుర్తుపట్టి, అతికష్టంమీద, కనులు తెరచింది సలీమ. ఏదో చెప్పాలని పాదుషావైపు తిరిగింది; కాని నోట మాటరాక కళ్ళప్పగించి చూస్తూ వుండిపోయింది.

(సశేషం)